"గుర్తు పట్టగలనుకానీ ఇప్పుడు మనం ఇంటికి వెళ్ళడంలేదు"

"మరి ఇంకెక్కడికి వెళ్తున్నాం?" పార్వతమ్మ భర్త వంక అయోమయంగా చూసింది.

"మనం హోటల్ రూంలో దిగుతున్నాం" అని చెప్పాడు పర్వతాలరావు.

"ఎందుకూ?" మరింత అయోమయంగా చూసింది పార్వతమ్మ .

"మనం ఇంటికెళ్తే వాడు మనల్ని పోయినసారి చేసినట్టు మాయ చేసేస్తాడు. హోటల్లో దిగి వాడి మీద ఓ కన్నేసి వుంచాలి. ఆ సన్నాసి వెధవ నిజంగా ఒంటరిగా వుంటున్నాడా లేకపోతే వెధవ్వేషాలు ఏమైనా వేస్తున్నాడా.....ఇంకా ఏమేం వెర్రికళలు పోతున్నాడో కూడా తెలుసుకోవాలి".

"అయ్యో రాత! ఇప్పుడు చెప్పాపెట్టకుండా వచ్చాం కదా ఇంటికెళ్తే అన్ని విషయాలు అవే తెలుస్తాయి".

"నీ బొంద పోయినసారి కూడా చెప్పాపెట్టాకుండా వెళ్ళాం. కానీ ఏం జరిగింది? నన్నో వెర్రి వెధవని, నిన్నో పిచ్చికుంకనీ చేసి ఆడించాడు బద్మాష్ వెధవ. ఆ చీరలు కట్టుకుంటానని చెప్పడం ఏంటి, ఆ బొట్టు కాటుకలు పెట్టుకుంటాననడం ఏంటీ? హవ్వహవ్వహవ్వ..... బనీన్ల బదులు బాడీలు వేస్కుంటాట్ట! అలా చేస్తే ఏ సన్నాసి వెధవైనా నమ్ముతాడా?" పళ్ళు కొరికాడు పర్వతాలరావు .

"మీరు నమ్మేగా చెవులాడించుకుంటూ వెనక్కి వచ్చేసారు" ఎద్దేవా చేసింది పార్వతమ్మ .

"నమ్మితే ఇప్పుడు హఠాత్తుగా ఎందుకు ప్రయాణం కడతాను. చూస్తుండు ఈ సారి మొత్తం తేల్చి పారేస్తా"

పర్వతాలరావు సూట్‌కేసుని కుడిచేతిలోంచి ఎడమ చేతిలోకి మార్చుకుంటూ ఆటోలు పార్క్ చేసిన వైపు ఆడుగులు వేసాడు. పార్వతమ్మ అతన్ని అనుసరించింది.

ఇంతలో ఇద్దరు బిచ్చగాళ్లు వాళ్ళ కాళ్ళకి అడ్డు తగిలారు.

"అమ్మా ధర్మం"

"బాబూ ధర్మం"

"తల్లీ ధర్మం"

వాళ్ళిద్దరి మొహలమీద బొచ్చేలు పెట్టి బిచ్చగాళ్ళు గోలగోలగా అరిచారు.

"ముందు బొచ్చెలు మా మొహాల మీద నుండి తియ్యండి మాయదారి గోల... అప్పుడే తెల్లారిపోయింది వెధవ సంతకి" విసుక్కున్నాడు పర్వతాలరావు .

బిచ్చగాళ్లు బొచ్చెలు వెనక్కి లాక్కున్నారు.

పర్వతాలరావు జేబులోంచి రెండు రూపాయి బిళ్ళలు తీసివేసాడు.

"ఇంక వెళ్ళండి.....హు! సన్నాసి వెధవలు.....పిజారి వెధవలు."

"గ్గో గిట్ల తిడ్తే మంచిగుండదు సంఝే"అన్నాడు ఓ బిచ్చగాడు పొగరుగా.

"ఆ! బిచ్చగాడివి నీకే ఇంత పొగరా ఆవేశంగా అన్నాడు పర్వతాలరావు .

“నేను బిచ్చగాడిని కాను” నెత్తిమీద విగ్గుని తీసేసాడు.

“మరి ఎవరు నువ్వు...మీరు”అయోమయంగా అడిగాడు పర్వతాలరావు .

“ఇనస్పెక్టర్ యాద్గిరి. వీడు బిచ్చగాడు కాడు. మా కానిస్టేబుల్” అక్కడ పక్కనున్న వాడిని చూపిస్తూ.

కానిస్టేబుల్ కూడా నెత్తిమీద విగ్గు తీసేసాడు.

“ఓ పోరి మిస్సింగ్ అయితే గిట్ల మారువేషాల్ వేసుకుని ఆమె కోసం దేవులాడుతున్నాం” అని ఇనస్పెక్టరు యాద్గిరి జేబులోంచి సీత ఫోటో తీసి పార్వతమ్మ మొహాన్ని సరిచూసి“ ఇస్కీ గీమె కాదు గీమె ముదితిపోయింది. గామె ఫోటోలు చాన లేతగ కోడుతుంది” పెదవి విరుస్తూ అన్నాడు ఇనస్పెక్టర్ యాద్గిరి.

“ఏది బాబూ....పాపం అ తప్పిపోయిన అమ్మాయి ఎవరో కాస్త నాకు కూడా చూపించు” అంది పార్వతమ్మ .

ఇనస్పెక్టర్ తన చేతిలోనే ఫోటోని పార్వతమ్మకిచ్చాడు. సీత  ఫోటోని చూస్తూనే పార్వతమ్మ కెవ్వుమని కేకవేసింది. పర్వతాలరావు కంగారుగా పార్వతమ్మ చేతిలోని అ ఫోటో లాక్కుని చూసి తనుకూడ కెవ్వుమని అరిచాడు.

ఇనస్పెక్టర్ యాద్గిరి కానిస్టేబుల్ మొహమొహాలు చూసుకున్నారు.

“గా పిల్ల మీకు తెల్సా?” అడిగాడు యాద్గిరి.

పర్వతాలరావు తల వూపాడు తెలుసున్నట్లు.

“గిప్పుడు యాడుంది?”

“మాకేం తెలుసు...మీరు చెప్పేదాకా మాకేతెలీదు ఆ పిల్ల మిస్సింగ్ అయ్యిందని. ఇంతకి ఆ పిల్ల మిస్సింగ్ అయ్యిందని మీకు కంప్లయింట్ ఇచ్చిందెవరు?” అడిగాడు పర్వతాలరావు .

“బుచ్చిబాబు అని ఓ హౌలాగాడున్నాడ్లే” అన్నాడు కానిస్టేబుల్.

ఈసారి పర్వతాలరావు, పార్వతమ్మ ఇద్దరూ కోరస్‌గా కెవ్వుమని అరిచారు.

“నేను చెప్పలేదూ ఏదో గూడుపుఠానీ జరుగుతుందనీ..అందుకే ఇంటికి వెళ్ళొద్దని అన్నాను....పద....పద......” అంటూ ఇనస్పెక్టర్‌నీ, కానిస్టేబుల్‌ని పట్టించుకోకుండా ఆటో దగ్గరికి గబగబా నడిచాడు పర్వతాలరావు. పార్వతమ్మ పడుతూ లేస్తూ అతన్ని అనుసరించింది.

ఇద్దరూ ఆటో ఎక్కి కూర్చున్నారు.

“బాబూ...... ఈ వూళ్ళో మంచి హోటల్ ఏది?” ఆటో వాడిని అడిగాడు పర్వతాలరావు.

“హోటల్ రంభ సార్” చెప్పాడు అటోవాడు.

“అక్కడికి పోనీయ్”

ఆటో రయ్యిన ముందుకు కదిలింది.

“హోటల్ రంభ” ఇనస్పెక్టర్ అలోచనగా బుర్రకాయ్ వూపాడు “జరూర్ ఏదో కిర్‌కిరీ నడుస్తూంది...మనముగీళ్ళమీద నజర్ పెట్టాల”

“ఔ సార్” అన్నాడు కానిస్టేబుల్.

0 0 0

బుచ్చిబాబు గోడగడియారము వంక చూసాడు. సమయము ఏడుగంటలయింది. రెండుగంటలు తల్లిదండ్రుల కోసం ఎదురుచూసి అతనికి విసుగు వచ్చేసింది.

రాత్రి హైదరాబాద్‌లోని ప్రక్కింటికి ఫోన్ చేస్తే వాళ్లు విజయవాడకి బయలుదేరినట్టుచెప్పారు. ఆ ప్రకారము ఆలోచిస్తే ఉదయం అయిదు గంటలకే రావాలి. కానీ ఏడుగంటలైనా ఇంకా రాలేదు.

దార్లో బస్సు ఫెయిలయిందా?

ట్రాఫిక్ జామా?

అసలు వీళ్లు విజయవాడకే బయలుదేరారా? ఇంకెక్కడికైనా వెళ్ళారా?

బుచ్చిబాబుకి ఏం చేయాలో తోచలేదు.

న్యూస్‌పేపర్ అందుకున్నాడు, మొదటి పేజిలోని వార్తలన్నీ చదివేసాడు. రెండో పేజీ....మూడోపేజీ....నాలుగు.......

ప్రతి అక్షరం చదువుతున్నాడు. ఏం చెయ్యాలి మరి? టైం గడవాలి!

అయిదో పేజీలో వార్త అతన్ని ఆకర్షించింది.

ఎన్నో హత్యలకు, మానభంగాలకు ఆ కిరాయి హంతకుడు కారకుడు పోలీసులకు కూడా ఆ విషయము తెలుసు కానీ అతన్ని అరెస్టుచేసి జైల్లో వేయడానికి, ఉరి తియ్యడానికి కనీసము ఒక్క ఆధారము లేదు. ఆ కరకు కసాయి హంతకుడి విషయంలో పోలీసులు నిస్సహాయులు.

ఆ హంతకుడి ఆర్టికల్ గురించి పడింది ఆ పేజీలో అతని ఫోటో కూడా వేసారు.

అతనే రుస్తుం దాదా!

* * *

డోర్ బెల్ మోగింది.

“కమిన్!” అంది సీత .

తలుపు తోసుకుని బేరర్ వచ్చాడు. అతని చేతిలో పొగలు కక్కుతున్న కాఫీ కప్పుని టీపాయ్ మీద పెట్టి వెనక్కి తిరిగి అడుగులు వేసాడు.

సీత కాఫీ కప్పు అందుకుని పెదాలకు ఆనించింది.

బేరర్ గుమ్మం దాకా వెళ్ళి వెనక్కి తిరిగిచూసి “సార్ లేరామ్మా?” అని అడిగాడు.

“లేరు” సమాధానము చెప్పింది సీత .

“రాత్రి కూడా లేరమ్మా?” మళ్లీ అడిగాడు.

సీతకు ఒళ్ళు మండింది.

"నీకేందుకు ఇన్ని అరాలు? పోయి నీపని చూస్కో" విసుక్కుంటూ అంది సీత .

బేరర్ గది బయటికి వచ్చాడు.

"ఆరా తీస్తే ఏంటి? వాడు మొగుడైతే ఈవిడకెందుకు కోపము వస్తుంది? ఏదో గొడవుంది" అనుకున్నాడు వాడు.

0 0 0

హోటల్ ముందు ఆటో అగింది, దాంట్లోంచి బుచ్చిబాబు దిగాడు. డబ్బులు ఇచ్చి వాడిని పంపించేసి హోటల్లోకి అడుగుపెట్టాడు. ఎనిమిది దాకా తల్లిదండ్రుల కోసం ఎదురుచూసి వాళ్ళు రారని నిర్ణయం చేసుకుని హోటల్కి వచ్చేసాడు.

మరోసారి హైదరాబాద్కి ఫోన్చేసి వాళ్ళు విజయవాడకి రాలేదని కన్ఫర్మ్ చేసుకుని హోటల్ రూం ఖాళీ చేసేసి ఇంటికి వెళ్ళిపోదామని బుచ్చిబాబు నిర్ణయించుకున్నాడు.

హోటల్ గదిలోకి అడుగుపెట్టాడు బుచ్చిబాబు .

"మీ అమ్మానాన్నలు వచ్చారా?" బుచ్చిబాబుని అడిగింది సీత .

"రాలేదు...." సీత ప్రక్కన మంచంమీద కూర్చుంటూ చెప్పాడు బుచ్చిబాబు .

"అదేంటి? వాళ్ళు ఇక్కడికి వస్తున్నట్టు మీ పక్కింటివాళ్లు చెప్పారన్నావు?"

"అదే నాకు అర్థం కాలేదు. మరోసారి ఫోన్చేసి కనుక్కుంటాను."

బుచ్చిబాబు రిసెప్షన్కి ఫోన్ చేసి హైదరాబాద్కి కనెక్షన్ ఇప్పించమని అడిగాడు.

అయిదు నిముషాలలో పక్కింటికి కనెక్షన్ వచ్చింది.

ఫోన్లో మాట్లాడిన బుచ్చిబాబు మొహం వేలాడేసాడు.

"ఏమైంది?" అడిగింది సీత .

"మా వాళ్ళు ఇక్కడికి బయలుదేరారంట! ఒకవేళ బస్సు దార్లో ఫేలయి లేటయిందేమో!"

"అయ్యో ఇప్పుడెలా? నువ్విక్కడికి వచ్చేశావు. ఒకవేళ ఇప్పుడు మీ అమ్మానాన్న ఇంటికివెళితే తాళం పెట్టి వుంటుందిగా?"

"మరేం ఫర్వాలేదులే. మా అమ్మానాన్నవస్తే ఇవ్వమని పక్కింటి వాళ్ళకి డూప్లికేట్ తాళం చెవి ఇచ్చి వచ్చాను. మనం ఓ పనిచేద్దాం. స్నానం చేసి క్రిందకి వెళ్ళి రెస్టారెంట్లో వేడివేడిగా టిఫిన్ చేద్దాం. తరువాత నువ్వు గదికి వచ్చేయ్, నేను మరోసారి ఇంటికెళ్ళి వాళ్ళు వచ్చారేమో చూస్తాను" అన్నాడు బుచ్చిబాబు .

"అలాగే?" అంది సీత.

ఇద్దరూ గదిలో తాళంపెట్టి క్రిందకి వెళ్ళి రెస్టారెంట్లో ఓమూల కూర్చున్నారు.

ఇద్దరూ సర్వర్ కోసం ఎదురుచూస్తున్నారు.

అంతలో పెద్దగా కేకలు వినిపించాయి.

“వెధవ ఇడ్లి ఏంటింత చప్పగా చచ్చింది. వెధవ చట్నీ ఇదసలు చట్నీయా నీళ్ళా?”

ఆ గొంతు విన్న బుచ్చిబాబు నిలువెల్లా వణికిపోయాడు. అది అతని తండ్రి గొంతు. బుచ్చిబాబు మెల్లగా తలతిప్పి చూసాడు.

ఆ ప్రక్కగా టేబుల్ దగ్గర బుచ్చిబాబు తల్లిదండ్రులు పర్వతాలరావు , పార్వతమ్మలు కూర్చుని వున్నారు. వాళ్ళు అటు తిరిగి వీపులు ఇటు పెట్టి కూర్చున్నారు. బుచ్చిబాబు కెవ్వుమని అరవబోయి మళ్లీ కేక బయటికి రాకుండా రెండు చేతులు నోటిమీద పెట్టి నొక్కుకున్నాడు.

“ఏంటి? ఏమైంది?” కంగారుగా అడిగింది సీత.

“ష్! మెల్లగా” సీత చెవిలో అంటూ అటు చూడు అన్నట్టుగా సైగచేసాడు.

సీత తల తిప్పి చూసింది. పర్వతాలరావు, పార్వతమ్మలను చూసిన సీత కూడా కెవ్వుమని అరవబోయింది. బుచ్చిబాబు ఠక్కున ఆమె నోరు నొక్కేసాడు.

నాలుగు క్షణాలు ఆగి సీత నోటి మీద నుంచి చెయ్యి తీసేసాడు.

“మీ వాళ్ళు ఇక్కడికి వచ్చారేంటి ఒకవేళ ఇంటికి తాళం వుంటే ప్రక్కింటి వాళ్లని అడగకుండా ఇక్కడ దిగారేమో?” అంది సీత .

“అదేంటి? నేను ఇప్పుడేకదా ఇంటి నుండి వచ్చాను. అప్పుడేవాళ్ళు ఇంటికి వెళ్ళడం, తాళం వేసి వుండడాన్ని చూడడం, మళ్లీ ఇక్కడికొచ్చి రూం తీసుకోవడం, రూంలో సామాను సర్దేసి రెస్టారెంట్‌కి రావడం, ఇది సాధ్యమయ్యే పనేనా?” ఆలోచనగా అన్నాడు బుచ్చిబాబు.

“నిజమే కదా” అయోమయంగా మొహం పెట్టి అంది సీత .

అప్పుడే పర్వతాలరావు చేత చీవాట్లు తిన్న సర్వర్ విసుక్కుంటూ అక్కడికి వచ్చాడు.

“ముసలాడు పొద్దున్నుండీ చంపేస్తున్నాడు. ఛీ....ఛీ....ఛీ...... చెప్పండి సార్ మీకేం కావాలి?” బుచ్చిబాబుని అడిగాడు.

“ఏంటి ప్రాబ్లం?” ఇన్ఫర్మేషన్ లాగే ఉద్దేశ్యంతో సర్వర్‌ని కదిపాడు బుచ్చిబాబు .

“ఏంటంటే ఏం చెపుతాం సార్. అన్నీ ప్రాబ్లమ్సే. ఈ వేళ ఉదయం అయిదు గంటలకి ఇక్కడ దిగాడు. అప్పటినుండి అందర్నీ సతాయించి పారేస్తున్నాడు. సరేగానీ మీకేం కావాలో చెప్పండి సార్”

“మాకేం వద్దులే. ఇక్కడ మాకేం నచ్చలేదు. మేం రూంలోకే తెప్పించుకుని తింటాం” మెల్లగా అన్నాడు బుచ్చిబాబు .

“ఏంటోగానీ భలేకేసులు దొరికార్రా నాయనా....ఆ ముసలాడేమో గట్టిగా అరుస్తూ మాట్లాడుతున్నాడు. ఈయనేమో ఏదో రహస్యం చెబుతున్నట్టు మెల్లగా మాట్లాడుతున్నాడు” అనుకుంటూ అక్కడి నుండి సర్వర్ వెళ్ళిపోయాడు.

"మీవాళ్ళు తెల్లారి అయిదుకే ఇక్కడ దిగారు. ఆ టైంలో నువ్వు ఇంట్లోనే వున్నావుకదా మరి ఇక్కడ ఎందుకు దిగినట్టో?" అంది సీత .

"అదే నాకు అర్థం కావడంలేదు. మనం రూంకి వెళ్లి మాట్లాడుకుందాం పద, మానాన్న వెనక్కి తిరిగి చూసాడంటే మన పని గోవిందా" అంటూ బుచ్చిబాబు లేచాడు.

సీత కూడా లేచి నిలబడింది.

ఇద్దరూ పర్వతాలరావు , పార్వతమ్మల వెనకనుండే బయటికి వెళ్ళాలి.
వాళ్ళని దాటి ముందుకు వెళుతుండగా పర్వతాలరావు పార్వతమ్మతో ఇలా అనడం వినిపించింది.

"టిఫిన్ తిన్నాక మనం మన వెధవాయ్ గురించి ఇన్వేస్టిగేషన్ మొదలు పెట్టాలి. ఇక్కడ వాడేసే వెధవ్వేషాలు గురించి రహస్యంగా కూపీ లాగాలి"

రెస్టారెంట్ హాల్లోంచి బయటికి వచ్చాక సీత అంది.

"అర్థమయిందా మీ వాళ్ళంత సడెన్గా ఇక్కడికి ఎందుకు వచ్చారో? ఇంటికి రాకుండా ఈ హోటల్లో ఎందుకు దిగారో?"

బుచ్చిబాబు వెర్రిమొహం వేసుకుని తల ఊపాడు. ఇద్దరూ మెట్లెక్కి రూం వైపు కారిడార్లో నడవసాగారు. రూం సమీపిస్తుండగా బుచ్చిబాబు భుజం మీద బరువైన చెయ్యి బలంగా పడింది.

బుచ్చిబాబు వెనక్కి తిరిగి చుసాడు.

ఆరడుగుల ఎత్తు, అరవై అంగుళాల ఛాతీ, ఎర్రటి కళ్ళతో....
ఆ వ్యక్తి చూస్తూనే గుర్తు పట్టాడు బుచ్చిబాబు ఎందుకంటే అంతకు గంట క్రితమే అ కరుడు కట్టిన హంతకుడి గురించి పేపర్లో చదివాడు.

అతనే రుస్తుందాదా.....

రుస్తుందాదా చూడగానే బుచ్చిబాబు ఒళ్ళు చల్లబడింది. కాళ్ళుగడగడా వణికాయి. గుండే బరువుగా కొట్టుకోవడం మొదలు పెట్టింది.

ఆ కసాయి హంతకుడికి తనతో పనేంటో బుచ్చిబాబుకి అర్థం కలేదు.

"ఎ.........ఎ......ఏంటి?" తడబడుతూ అడిగాడు బుచ్చిబాబు .

"నేనీ ఉరికి కొత్త. ఈ అడ్రస్ ఎలా వెళ్ళలో చెప్పు" బొంగురు గొంతుతో అన్నాడు రుస్తుం దాదా.

హమ్మయ్యా...అంతే కదా అని తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు బుచ్చిబాబు.